టాటా ఏస్ వ్యాన్ దగ్ధం

శ్రీరాంపూర్, నవంబర్ 21: శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న టాటా ఏస్ వ్యాన్ దగ్ధమైంది. వ్యానులో పెళ్లికి వెళ్తుండగా శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ సమీపం వద్దకు రాగానే వ్యానులో నుంచి పొగలు వచ్చాయి. డ్రైవర్ అప్రమత్తమై ప్రయాణికులను కిందికి దింపేశాడు. మంటలు మరింత ఎగిసిపడి వ్యాన్ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

భీమారం, నవంబర్ 21 : బైక్‌పై వెళ్తుండగా అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కింద పడడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం జరిగింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చెందిన గాదే కనకయ్య, జక్కుల ఐలయ్య భీమారం మీదుగా బైక్‌పై చెన్నూర్‌కు వెళ్తుండగా ఆరెపల్లి క్రాస్ రోడ్డు వద్ద అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కింద పడ్డారు. దీంతో కనకయ్య తలకు తీవ్ర గాయాలు కాగా వారిని 108 అంబులెన్స్‌లో స్థానికులు తరలించారు.

జేసీబీని ఢీకొట్టిన కారు

శ్రీరాంపూర్,నవంబర్ 21 : శ్రీరాంపూర్ ఏరియా కొత్తరోడ్డు జాతీయ రహదారి వద్ద ముందు వెళ్తున్న జేసీబీని వెనుక నుంచి కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, అందులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని పోలీసులు ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. గోదావరిఖనికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కలప స్మగ్లర్ బైండోవర్

భీమారం, నవంబర్ 21 : కొంత కాలంగా బూర్గుపల్లి అటవీలో టేకు చెట్లను నరికి స్మగ్లింగ్ చేస్తున్న బూర్గుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సాపోట గూడేనికి చెందిన సోపోట తూలసీరాంను తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సదానందం ముందు రూ. 5 లక్షల పూచికత్తుపై ఓడోవర్ చేశారు. అటవీశాఖ అధికారులు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా తీరు మారక పోవడంతో బైండోవర్ చేసినట్లు మంచిర్యాల ఫారెస్ట్ రేంజర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఇక్కడ ఎఫ్ఎస్వోలు బండి రాజవ్వ, సతీశ్, దాంపూర్ బీట్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్, నవంబరు 21 : మంచిర్యాల జిల్లాలో 2024-25 సంవత్సరంలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్, డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్ కోసం అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I, AMER BIN ALI YAFAYEE S/o. ALI BIN SAYEED, H.No.4-5-447, Bhuktapur, Dist. Adilabad, is hereby change my Daughter's Name "HANAN" (Old Name) To As "HANAN AMER YAFAYEE" (New Name) holding Passport No. L6668506 Dt.27-03-2014 to 26-03-2019 issued at Riyadh (KSA) as per her Adhar card etc. Hence Declared

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
ఖమ్మం: 91827 77671, 91827 77677

దళితుడు కాబట్టే జైలుకు పంపిండ్రు

- రా రైస్ మిల్లర్ల సంఘం నాయకుల ఆరోపణ

దర్శనాల రమేశ్‌కు సంఘీభావం తెలుపుతున్న గణపతి రెడ్డి, మిల్లర్లు

భీమారం, నవంబర్ 21 : దళితుడు కాబట్టే రైస్ మిల్లర్ దర్శనాల రమేశ్‌ను జైలుకు పంపించారని, మిగతా మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని రా రైస్ మిల్లర్ల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఈసీ మెంబర్ గుంత సందీప్, రా రైస్‌మిల్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గుంత నాగరాజు, రా రైస్ మిల్లర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ యాదవ్, జాయింట్ సెక్రటరీ కాళేశ్వరం సాగర్ ఆరోపించారు. మండలంలోని పోలంపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు దర్శనాల రమేశ్‌కు హాజీపూర్ మండలంలోని నర్సింగాపూర్‌లో దుర్గ ఇండస్ట్రీస్‌తో పాటు, బెల్లంపల్లి పట్టణంలోని మాతేశ్వరి రా రైస్‌మిల్లులు ఉన్నాయి. ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం పెట్టలేదనే నేపంతో అధికారులు క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపినట్లు తెలిపారు. జైలు నుంచి ఇంటికి వచ్చిన రమేశ్‌కు సంఘీభావం తెలిపారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీమారం, నవంబర్ 21 :బూర్గుపల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూక్యా రాజ్ కుమార్ నాయక్, భూక్యా రాజు నాయక్, భూక్యా దావ్ నాయక్, పానుగంటి లచ్చన్న, బలరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల, నవంబర్ 21: నెన్నెల, మన్నెగూడెంలో పీఏసీఎస్, డీసీఎంస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హరీశ్, శ్రీనివాస్ గౌడ్, మల్లాగౌడ్, పోచిరెడ్డి, సీవో రాజేశ్, తిరుపతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్, నవంబర్ 21: చెన్నూర్ పట్టణంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం మార్నింగ్‌వాక్ చేశారు. వార్డుల్లో రోడ్లు, మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అమృత్ పథకం వాటర్ ట్యాంక్ వేరే చోట నిర్మించాలని గురుకృప స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు విన్నవించారు. సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ నిచ్చారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కాసిపేట, నవంబర్ 21 : బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం భరత్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో ఎస్‌డీఎఫ్ పథకం కింద రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తె భూమయ్య, గోమాస భీమయ్య, దూడం మహేశ్, జైన శ్రీనివాస్, పొన్నాల కనక రాజు, దుర్గం గోపాల్, రాకేశ్, శ్యాం బాబు, రామస్వామి, సురేశ్, సాంబయ్య, దుర్గ, నారాయణ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించవద్దు

జన్నారం, నవంబర్ 21 : వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించవద్దని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా కొనుగోళ్లను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సంగీత, ఆర్ఐ భానుచందర్, ఏపీఎం బుచ్చన్న, ఏఈవో త్రిసంధ్య,కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన

లక్షెట్టిపేట, నవంబర్ 21; లక్షెట్టిపేట పట్టణంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాలలో గురువారం పోలీసులు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఆకతాయిలు వేధింపులతో పాటు ఎలాంటి సమస్యలున్నా 100 నంబర్‌కు గాని, 6303923700 నంబర్‌కు గాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సఖీ సెంటర్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, గంజాయి, డ్రగ్స్, ఆత్మహత్యలు, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కవిత, బ్లూకోల్ట్స్ పోలీసులు అంజిబాబు, షీటీం కానిస్టెబుల్ సతీశ్, భరోసా సెంటర్ నిర్వాహకులు పుష్పలత, విజయ, సఖీ సెంటర్ నిర్వాహకురాలు రమా, ఇందిర, విద్యార్థులున్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

తాండూర్, నవంబర్ 21 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) తాండూర్ మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జీ చక్రపాణి, రాజవేణు ఆధ్వర్యంలో గురువారం తాండూర్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీ దేవదాస్, ఉపాధ్యక్షులు కే ఖగపతి, పీ నాగచంద్రిక, ప్రధాన కార్యదర్శి జీ సంపత్, కోశాధికారి ఎస్ శ్రీనివాస్, కార్యదర్శులు జే అశోక్, ఎస్ కళావతి, సీహెచ్ రాజేశ్, పీ మల్లేశ్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం శిరీశ్ కుమార్, మెంబర్ డీ పద్మ, మహిళా కమిటీ కన్వీనర్ ఎన్ స్వప్న, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ మనీషా, వీవోటీటీ కన్వీనర్ ఎం లింగయ్య, పీడబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఏ చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. వీరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి

మంచిర్యాల (ఏసీసీ), నవంబర్ 21: ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రధాని నరేంద్ర మోడీకి జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు లేఖ రాశారు. బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. జనాభాలో 60 శాతం బీసీలున్నప్పటికీ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడం బాధాకరమని అన్నారు. 32 పార్టీలు, తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలు బిల్లు కోసం సమ్మతం తెలిపినా బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా బిల్లు ప్రవేశపెట్టకపోతే, పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, , కర్రె లచ్చన్న, అక్కల రమేశ్, శాఖపురి భీంసేన్, అక్కం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్లు అరెస్ట్

మందమర్రి రూరల్, నవంబర్ 21: సారంగపల్లి శివారులోని వన్యప్రాణుల కోసం అమర్చిన కరెంటు తీగలతో రెండు పశువుల మృతికి కారణమైన సంద్రోనిపల్లికి చెందిన గోస్కుల సతీశ్, గోస్కుల రాజు, దయనేని లచ్చును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్ తెలిపారు. ఇక్కడ ఆఫీసర్లు ఎస్ రాజేశ్వరి, సతీశ్, అంజిత్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

నస్పూర్, నవంబర్ 21 : మంచిర్యాలలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డే వేడుకలను పద్మనాయక ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే ఇవ్వాలి

బెల్లంపల్లి, నవంబర్ 21 : శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే ఇవ్వాలని సీపీఎం ఏరియా కార్యదర్శి గుమాస అశోక్, కమిటీ సభ్యుడు అబ్బోజు రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బెల్లంపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో సంతకాలను సేకరించారు.

కాసిపేట, నవంబర్ 21 : కాసిపేట మండలంలోని సోమగూడెం చౌరస్తా వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆటో ఓనర్స్, డ్రైవర్స్, చిరు వ్యాపారులు మద్దతు తెలిపారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

చెన్నూర్ : జెండా ఎగుర వేస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

ఆసిఫాబాద్ : జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు సేర్ల మురళి, నాయకులు

చెన్నూర్, నవంబర్ 21: చెన్నూర్ పట్టణంలో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంతో పాటు, ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ జెండాను ఎగురవేశారు. అనంతరం ముదిరాజ్ మహా సభ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ మాట్లాడుతూ బీసీల జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను పెంచాలని, ముదిరాజ్‌కు జనాభాకు తగ్గట్టుగా రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మత్స్యశాఖకు రూ 3,000కోట్లను కేటాయించి మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

దండేపల్లి, నవంబర్ 21: దండేపల్లి మండల కేంద్రంలో 21వ అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గరికంటి కొమురయ్య, యువజన అధ్యక్షుడు గరిగె సుమన్, శ్రీకాంత్, సతీశ్ జిల్లా అధ్యక్షుడు మేకల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్, నవంబర్ 21 : మండలంలోని ఏటిగూడలో మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముదిరాజ్ మండల అధ్యక్షుడు తున్కి సురేశ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నెల్లి మహేశ్, పంబాల సన్నాసి, అంజయ్య, శ్రీశైలం, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌టౌన్, నవంబర్ 21:ముదిరాజుల హక్కుల కోసం పోరాడుదామని తెలంగాణ ముదిరాజ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు సేర్ల మురళి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. బీసీ(డీ)లో ఉన్న ముదిరాజులను బీసీ(ఏ)లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజుల సంఘం మండల అధ్యక్షుడు పులి సతీశ్, నాయకులు రవి, రాజేశ్, నరేశ్, బాలేశ్, సాయిరాం, శంకర్, ఎన్.రవి, తిరుపతి తదితరులున్నారు.

కౌలు రైతులకు 'భరోసా' ఇవ్వాలి

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న



ఎమ్మెల్యే కోవ లక్ష్మి కి వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతులు, నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 21: కౌలు రైతులను గుర్తించి వెంటనే రైతు భరోసా నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మికి రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న విన్నవించారు. కౌలు రైతులతో కలిసి గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా కౌలు రైతులకు రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అటవీ హక్కు పత్రాలున్న రైతులకి సంబంధించిన భూముల్లో బోరుబావులకు త్రీ ఫేస్ కరెంట్ ఇప్పించాలని, ఆర్వోఎఫ్ఆర్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు మాణిక్ రావ్, దుందేరావు, యశ్వంత్, మహేశ్ తదితరులు ఉన్నారు.

కారుణ్య నియామక పత్రాలివ్వాలి

శ్రీరాంపూర్, నవంబర్ 21 : శ్రీరాంపూర్ ఏరియాలో కారుణ్య నియామకాల ద్వారా వీటీసీ శిక్షణ పొందిన కార్మికుల పిల్లలకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వకుండా రాజకీయ ఒత్తిడితో నిలిపివేశారని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య ఆరోపించారు. వీటీసీ శిక్షణ పొందిన యువకులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలివ్వకుండా నిలిపివేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికే ఉద్యోగ నియామక పత్రాలివ్వడాన్ని ఆపడం సరికాదని, వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

భీమారం కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

భీమారం, నవంబర్ 21 : భీమారం కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణ రెడ్డి వర్గంతో ఎల్‌బీపేట్, ఎల్కేశ్వరం, మద్దికల్ గ్రామాల నుంచి చెన్నూర్‌కు వెళ్లేందుకు దారి సరిగ్గా లేకపోవడంతో గ్రామస్తుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని సొంత ఖర్చులతో ట్రాక్టర్‌తో చదును చేయగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి సోషల్ మీడియాలో తాత్కాలిక పనులు వద్దు' ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోయి రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేషన్ వేసి పట్టుకువచ్చినట్లు తెలిపారు. చేకూర్తి సత్యనారాయణరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. పార్టీ అధ్యక్షుడిగా తమకు తెలియకుండా తమ గ్రామానికి రావడం ఏమిటని ప్రశ్నించారు. కొంత కాలంగా భీమారం కాంగ్రెస్‌లో నాలుగు వర్గాలు కొనసాగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం తనకు కాంగ్రెస్ నాయకులతో ప్రాణహాని ఉందని చేకూర్తి సత్యనారాయణరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

భార్యతో అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో హత్య

-ఓఎల్ఎక్స్‌లో కారు కొని ఢీకొట్టి ఓ వ్యక్తిని చంపిన భర్త

భీమారం, నవంబర్ 21 : భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు ఓఎల్ఎక్స్ వెబ్‌సైట్‌లో కారును కొనుగోలు చేసి ఢీ కొట్టి చంపిన ఘటన భీమారంలో వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జైపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో నిందితులను హాజరుపరిచి మాట్లాడారు. భార్యతో అక్రమ పెట్టుకున్నాడని అనుమానంతో జైపూర్ మండలంలోని రసూల్‌పల్లికి ఆకుదారి మల్లేశ్‌పై తోట సాయి కుమార్ కక్ష పెంచుకున్నాడు. మల్లేశ్‌ను చంపేందుకు పెద్దపల్లి జిల్లాకు చెందిన వరుసకు మామ అయిన గట్టు సదయ్యతో కలిసి పథకం వేశాడు. ఇందుకోసం ఓఎల్ఎక్స్ వెబ్‌సైట్ ఓ కారును కొన్నారు. బుధవారం ఉదయం బైక్‌పై వెళ్తున్న మల్లేశ్‌ను పథకం ప్రకారం కారుతో ఢీ కొట్టి పారిపోయారు. తీవ్రగాయాలైన మల్లేశ్‌ను దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఏసీపీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు వీరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

23న నేతకాని ఆత్మగౌరవ సభ

సీసీసీ నస్పూర్, నవంబర్ 21: నేతకాని మహార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న మంచిర్యాల ఆర్య వైశ్య భవన్‌లో నిర్వహించే నేతకానిల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని నేతకాని యువజన రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి యువరాజ్ పిలుపునిచ్చారు. గురువారం సీసీసీ నస్పూర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ హాజరయ్యే ఈ సభకు మంచిర్యాల జిల్లాలోని నేతకాని కులస్తులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి సునార్కరి రాంబాబు, నస్పూర్ మండల అధ్యక్షుడు దుర్గం శివరాం, నాయకులు దుర్గం లింగయ్య, జుమ్మిడి లక్ష్మి, జుమ్మిడి గోపాల్, చాపిడి విఘ్నేశ్, తదితరులు పాల్గొన్నారు.

అటు మంత్రుల పర్యటన..ఇటు నాయకుల అరెస్ట్

లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో దుంపల రంజిత్

బెల్లంపల్లి, నవంబర్ 21 :మంచిర్యాల జిల్లా కేంద్రానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీతక్కల పర్యటనను పురస్కరించుకుని పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు శ్రీకాంత్‌ను పోలీసులు గురువారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి తాళ్ల గురిజాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రజల సమస్యలను నాయకులకు చెప్పుకోవడానికి కూడా స్వేచ్ఛ లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

లక్షెట్టిపేటలో..

లక్షెట్టిపేట, నవంబర్ 21; లక్షెట్టిపేటలో సీఐటీయు జిల్లా నాయకుడు దుంపల రంజిత్‌ను అరెస్ట్ చేశారు. ఆశాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, అసంఘటిత కార్మికులైన జీపీ, మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు.

నస్పూర్, నవంబర్ 21 : మంత్రుల పర్యటన నేపథ్యంలో విద్యార్థి సంఘాల నాయకులు అరెస్ట్ చేయడం సరికాదని పీడీఎస్‌యూ నాయకుడు శ్రీకాంత్ అన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 21: మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సమస్యలపై పారామెడికల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకు వచ్చిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, 317 జీవోలోని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, అన్ని కేటగిరీల ఉద్యోగులకు 1తేదీని వేతనాలు చెల్లించాలని, డీఏలను చెల్లించాలని, పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జగదీశ్, కోశాధికారి నాందేవ్, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశమివ్వాలి

మంచిర్యాల (ఏసీసీ), నవంబర్ 21: నేతకాని కార్పొరేషన్, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని నేతకాని మహర్ సంక్షేమం సంఘం నేతలు గురువారం ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కోరారు. కులగణనలో నేతని అని వచ్చిన నేతకాని కులాన్ని సరిచేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గం రాజేశ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిపించండి సారూ..

- చెన్నూర్ ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్న సొంత పార్టీ నేతలు

ఎమ్మెల్యే వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కోటపల్లి, నవంబర్ 21 : గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, వారి కష్టం చూడలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు 'సారూ... మా ఊళ్లకు బస్సు నడిపించండి' అని సొంత పార్టీ ఎమ్మెల్యే చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు వినతి పత్రం సమర్పించారు.

కోటపల్లి మండలంలోని జనగామ రూట్‌లో ఆర్టీసీ బస్సు సేవలు పూర్తిగా నిలిచిపోయి ఆరు నెలలైందని, పారుపల్లి, లింగన్నపేట, ఎదులబంధం, సిర్సా, రొయ్యలపల్లి, పుల్లగామ, ఆలుగామ, జనగామ, నందరాంపల్లి, సూపాక గ్రామస్తులకు ఇబ్బందిగా మారి